ఉత్తమ ఎన్నికల అధికారిగా కలెక్టర్

ఎస్‌పి వకుల్, ఎపిఎస్‌పి కమాండెంట్ మల్లికా గార్గ్‌కు కూడా అవార్డులు

ప్రజాశక్తి-విజయనగరంకోట

ఉత్తమ ఎన్నికల అధికారిగా జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఎంపికయ్యారు. బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ కింద ఈ పురస్కారం వరించింది. జిల్లా కలెక్టర్‌తోపాటుగా ఇదే కేటగిరీలో ఎస్‌పి వకుల్ జిందాల్, ఎపిఎస్‌పి ఐదో బెటాలియన్ కమాండెంట్ మల్లికా గార్గ్ కూడా ఈ పురస్కారాలను అందుకోనున్నారు. వీరితోపాటు జిల్లాకు సంబంధించి ఉత్తమ ఎఆర్‌ఒగా రాజాం తహశీల్దార్ ఎస్.కృష్ణంరాజు, ఉత్తమ బూత్ లెవెల్ అధికారులుగా నెల్లిమర్ల నియోజకవర్గానికి చెందిన ఎం.హైమావతి, ఎం.శ్రీనివాసరావు కూడా ఈ పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరికి శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమంలో పురస్కారాలు ప్రదానం చేయనున్నారు.

ఉంటాయో.. ఊడుతాయో!

వికలాంగ పింఛను లబ్ధిదారుల్లో అయో మయం నెలకొంది. తమ పింఛన్లు ఉంటాయో... ఊడుతాయోనని ఆందోళన చెందుతున్నారు. పింఛన్ల పున:పరిశీలన పేరుతో ప్రభుత్వం చేపట్టిన ప్రక్రియే అందుకు కారణం. ఏదో ఒక సాకుతో పింఛన్లు తొలగిస్తారనే ప్రచారం సాగడంతో వారంతా ఆందోళనకు గురవుతు న్నారు. పరిశీలన కోసం సదరం శిబిరానికి వచ్చిన వికలాంగులు గంటల తరబడి నిలబడలేక పడరాని పాట్లు పడ్డారు. చాలా ఏళ్లుగా పింఛన్లు పొందుతున్న తమకెందుకు ప్రభుత్వం ఈ పరీక్ష పెడుతోందని ప్రశ్నిస్తున్నారు.

- వికలాంగుల్లో ఆందోళన
- సదరం శిబిరాలకు సహాయకులతో హాజరు
- పరిశీలన కోసం పడిగాపులు

సదరం శిబిరానికి వచ్చిన వికలాంగులు

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో 36,974 వికలాంగ పింఛన్లు ఉన్నాయి. వీటన్నిటినీ పునఃపరిశీలించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీని కోసం జిల్లాలోని ఐదు ఆస్పత్రుల్లో మొత్తం 13 ప్రత్యేక వైద్య బృందాలను ఏర్పాటు చేశారు. శారీరక వికలాంగుల కోసం గజపతినగరం, చీపురుపల్లి, రాజాం, శృంగవరపుకోట ఏరియా ఆస్పత్రులతోపాటు విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి (జిజిహెచ్)లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. అంధుల కోసం రాజాం, జిజిహెచ్, మూగ, చెవిటి వారి కోసం జిజిహెచ్, ఘోషా ఆస్పత్రిలో, మానసిక వికలాంగుల కోసం జిజిహెచ్‌లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. వికలాంగులు తమకు కేటాయించిన తేదీల్లో, ఆయా ఆస్పత్రులకు వెళ్లాలని అధికారులు సూచించారు. ఈ నెల 23న పున:పరిశీలన ప్రక్రియ ప్రారంభించగా, సచివాలయ సిబ్బంది ద్వారా అందిన నోటీసుల్లో భాగంగా వారంతా ఆయా ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు. అందులో భాగంగా విజయనగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వికలాంగులు సహాయకులతో కలిసి తరలివస్తున్నారు. అయితే ఏదో ఒక వంకతో పింఛన్లను రద్దు చేస్తారని వారంతా ఆందోళన చెందుతున్నారు.

ఆ ఆరోపణల వల్లే..

ప్రభుత్వం వికలాంగులకు, దీర్ఘకాలిక రోగులకు రూ.6 వేల నుంచి రూ.15 వేల వరకు పింఛన్లు అందిస్తోంది. వీరిలో కొందరు శారీరక వికలాంగులు. కొందరు నడవలేని స్థితిలో ఉన్న వాళ్లు, మరికొందరు వీల్‌చైర్లకు, మంచాలకు పరిమితమయ్యారు. అంధ, చెవిటి, మూగ పింఛనుదారులు ఇంకొందరు ఉన్నారు. వీరితోపాటు కిడ్నీ రోగులు, పక్షవాతంతో బాధపడుతున్నవారు.. ఇలా జిల్లా వ్యాప్తంగా అనేక అనారోగ్య సమస్యలతో పింఛన్లు పొందుతున్నారు. అనారోగ్య కారణంగా నెలల తరబడి, మరికొందరు జీవితకాలం మందులు తీసుకుంటున్నారు. ఇటువంటి వారికి ప్రభుత్వం సదరం ధ్రువపత్రాల ద్వారా పింఛన్లు అందిస్తోంది. గత వైసిపి ప్రభుత్వ హయాంలో కొందరు నకిలీ సర్టిఫికెట్లతో పింఛన్లు పొందుతున్నట్లు ఆరోపణలు రావడంతో టిడిపి కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత పింఛన్ల పరిశీలనకు ఆదేశించింది. దీంతో వికలాంగ, దీర్ఘకాలిక పింఛనుదారులంతా తమకు వచ్చిన నోటీసులను పట్టుకొని కుటుంబ సభ్యుల సాయంతో ఆస్పత్రులకు వస్తున్నారు.

గంటల తరబడి నిలబడలేక..

మొదట విడతలో మూడు రోజుల పాటు పునపరిశీలన నిర్వహిస్తున్నారు. గత రెండు రోజులుగా రోజుకు 550 మంది చొప్పున ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహిస్తున్నారు. పరిశీలన కోసం శుక్రవారం విజయనగరం వచ్చిన వికలాంగులు నానా పాట్లు పడ్డారు. గంటల తరబడి నిలబడాల్సి రావడంతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఇందులో చెవి, ముక్కు, గొంతు విభాగాలు, మానసిక రోగులు, ఆర్థో విభాగం, కంటి పరీక్షలు చేయించుకోవడానికి వందల మంది రావడంతో రద్దీ నెలకొంది. ప్రభుత్వం ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం ఉదయం సగం మంది, మధ్యాహ్నం సగం మందిని వైద్యులు పరీక్షిస్తున్నారు. సహాయకులతో వచ్చిన వారైతే వికలాంగుల బదులు వారే క్యూలో ఉండాల్సి వస్తోంది. చాలా ఏళ్లుగా పింఛన్లు పొందుతున్న తమకు ప్రభుత్వం ఎందుకు ఇలా ఎందుకు పరీక్ష పెడుతుందో అర్థం కావడం లేదని వికలాంగులు ఆవేదన చెందుతున్నారు. ఎవరో దొడ్డిదారిన పింఛన్లు పొందితే వారిని తొలగించకుండా, ఇలా అందరినీ ఇబ్బంది పెట్టడం సరికాదని అంటున్నారు.

క్యూలో నిలబడిన వికలాంగులు, వారి సహాయకులు

ఆశా వర్కర్లపై కేసు కొట్టివేత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

21 మంది ఆశా వర్కర్లు, సిఐటియు నాయకులపై పెట్టిన అక్రమ కేసును మొబైల్ కోర్టు శుక్రవారం కొట్టేసింది. ఎపి ఆశావర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో 2011 ఏప్రిల్‌లో కనీస వేతనాలు, రిటైర్‌మెంట్ బెనిఫిట్స్, పిఎఫ్, ఇఎస్ఐ తదితర సమస్యలపై డిఎంహెచ్‌ఒ కార్యాలయం వద్ద ధర్నా చేపట్టారు. ఈ సమయంలో వన్‌టౌన్ పోలీసులు... సిఐటియు నాయకులు, ఆశావర్కర్లు మొత్తం 21 మందిపై కేసు నమోదు చేశారు. సిసి నెంబర్ 872/22 ఈ కేసులో అప్పటి వన్‌టౌన్ సిఐ త్రినాథ్.. ఆశావర్కర్లపై లాఠీఛార్జీ చేశారు. ఆయనను మూడు నెలలపాటు అప్పటి ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఈ కేసులో సుమారు 14 ఏళ్లపాటు సుదీర్ఘ విచారణ సాగింది. 21 మంది సాక్షులను విచారించిన అనంతరం ఆశాలు తప్పు చేసినట్లుగా తగిన ఆధారాలు లేకపోవడంతో శుక్రవారం మొబైల్ కోర్టు జడ్జి కేసును కొట్టేశారు. ఆశావర్కర్ల తరపున న్యాయవాది కాళ్ల సన్యాసిరావు వాదించారు. కేసును కొట్టేయడంతో ఆశా వర్కర్స్ యూనియన్, సిఐటియు నాయకులు హర్షం వ్యక్తంచేశారు.

కేసు కొట్టేయడంతో ఆనందం వ్యక్తంచేస్తున్న ఆశాలు, సిఐటియు నాయకులు

సగటు వేతనం రూ.300 వచ్చేలా పనిచేయాలి

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లకు అదనపు కమిషనర్ నిర్దేశం

ప్రజాశక్తి-విజయనగరంకోట

జిల్లాలో ఉపాధి పనుల్లో పాల్గొనే వేతనదారులకు సగటు వేతనం కనీసం రూ.300 వచ్చేలా చర్యలు చేపట్టాలని రాష్ట్ర గ్రామీణాభివృద్ధి శాఖ అదనపు కమిషనర్ ఎం.శివప్రసాద్ ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్లకు చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామాల ఉపాధిహామీ ఫీల్డ్‌అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణను శుక్రవారం స్థానిక ఆనందగజపతి ఆడిటోరియంలో నిర్వహించారు. రానున్న సీజన్‌లో ప్రతి గ్రామ పంచాయతీలో చేపల పెంపకం కోసం కనీసం ఒక పాండ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీ పంచాయతీలో కనీసం ఒక పశువుల షెడ్ ఉండాలని, జిల్లాలో 2000 ఫారం పాండ్లు తవ్వేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. రానున్న సీజనులో జిల్లాలో వ్యవసాయ సంబంధ పనులనే అధికంగా చేపట్టాలని చెప్పారు. జాయింట్ కమిషనర్ జె.సునీత మాట్లాడుతూ పనులకు కొలతలు వేయడం, రిజిష్టర్లు నిర్వహించడం వంటి అంశాల్లో సహాయకులు కచ్చితంగా ఉండాలన్నారు. పనుల నాణ్యతపై క్వాలిటీ కంట్రోల్ అధికారి శ్రీనివాస్ సూచనలు చేశారు. డ్వామా పీడీ శారదాదేవి అధ్యక్షతన జరిగిన శిక్షణలో ఎపిడిలు మణికుమార్, ఆంజనేయులు పలు అంశాలపై అవగాహన కల్పించారు.

ఫీల్డ్ అసిస్టెంట్ల శిక్షణలో మాట్లాడుతున్న అదనపు కమిషనర్ శివప్రసాద్

చరణ్ కుటుంబానికి న్యాయం చేయాలి

నారాయణ కళాశాల వద్ద ఎస్‌ఎఫ్ఐ ధర్నా

ధర్నా చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అనంతపురంలో నారాయణ కళాశాలలో ఆత్మహత్యకు పాల్పడ్డ విద్యార్థి చరణ్ కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ నగరంలోని నారాయణ జూనియర్ కళాశాల వద్ద శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నా చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు డి.రాము మాట్లాడుతూ నారాయణ, శ్రీచైతన్య యాజమాన్యాలు ఫీజుల దోపిడీ చేస్తూ విద్యార్థులను వేధిస్తున్నాయని తెలిపారు. వాటివల్ల అనేకమంది విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్రంలో విద్యా శాఖ నిబంధనలు నారాయణ, శ్రీచైతన్య యాజమాన్యాలకు పట్టవా? అని ప్రశ్నించారు. అధికారంలోకి రాకముందు డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ నారాయణ... శ్రీచైతన్య, నారాయణ యాజమాన్యాల దోపిడీ గురించి చెప్తూ అధికారంలోకి రాంగానే వారిని కట్టడి చేస్తామని తెలిపారని గుర్తుచేశారు. విద్యార్థులు పిట్టల్లా రాలిపోతున్నా తమ మంత్రి వర్గంలోనే ఉన్న నారాయణకు చెందిన కార్పొరేట్ కళాశాలలు కావడంతో కిమ్మనడం లేదని మండిపడ్డారు. విద్యార్థులంతా సొంత బిడ్డల్లా భావిస్తానని చెప్పిన విద్యాశాఖా మంత్రి నారా లోకేష్.. ఇప్పుడు నారాయణ యాజమాన్యం విద్యార్థిని బలి తీసుకుంటే కనీసం స్పందన కూడా లేకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. తక్షణమే మరణించిన విద్యార్థి చరణ్ కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం ప్రకటించాలని డిమాండ్‌చేశారు. విద్యార్థిని వేధించిన నారాయణ కళాశాలను సీజ్ చేసి, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె.రవికుమార్, కె.జగదీష్, పి.రమేష్, సహాయ కార్యదర్శులు సమీరా, కె.రాజు, వంశీ, నాయకులు గుణ, రాహుల్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సాధికారతే లక్ష్యం

కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

బాలికల సాధికారత, సమానత్వం సాధన దిశగా జరిగే కృషిలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కోరారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బ్యానర్లపై కలెక్టర్ సంతకం చేశారు. అనంతరం మాట్లాడుతూ బాలికల రక్షణను మనందరి బాధ్యతగా భావించాలన్నారు. సామాజిక, ఆర్థిక, ఆరోగ్యపరంగా బాలికల ఉన్నతి కోసం సమిష్టిగా చర్యలు చేపట్టాల్సి ఉందన్నారు. రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ ఛైర్మన్ కేసలి అప్పారావుతో కలిసి బాలికల రక్షణకు సంబంధించి హెల్ప్ లైన్ నెంబర్లను తెలియజేసే పోస్టర్లను కలెక్టర్ విడుదల చేశారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్.సేతుమాధవన్, ఐసిడిఎస్ పీడీ సుధారాణి, డిఎంహెచ్‌ఒ, జీవనరాణి మాట్లాడారు.

సంతకం చేస్తున్న కలెక్టర్ బి.ఆర్.అంబేద్కర్

బాలికలను రక్షిద్దాం, బాలికను చదివిద్దాం.. అనే ప్రతిజ్ఞను కలెక్టరేట్ వద్ద చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల హక్కుల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు చిట్టిబాబు, పలువురు జిల్లా అధికారులు పాల్గొని సంతకాలు చేశారు.

బాలికల భద్రతకు భరోసా కల్పిద్దాం

బాలికలకు భద్రత కల్పించడం ప్రతిఒక్కరి భాధ్యతని జాయింట్ కలెక్టర్ సేతు మాధవన్ అన్నారు. జిల్లా చైల్డ్ రైట్స్ ఫోరం, ప్రజ్వల సంస్థ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం సందర్భంగా రూపొందించిన వాల్‌పోస్టర్‌ను జెసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలికల భద్రతకు సమస్య వచ్చినప్పుడు టోల్ ఫ్రీ నెంబర్ పోలీసులకు 100, చైల్డ్ లైన్ 1098, ఎమర్జెన్సీ నెంబర్ 112ను నేరుగా సంప్రదించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ఫోరం కన్వీనర్ చిట్టిబాబు, లైఫ్ ట్రీస్ టస్ట్ ఛైర్మన్ గర్భాపు రామారావు, హ్యూమన్ రైట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు భవిరెడ్డి శంకరరావు, ప్రజ్వల సంస్థ ప్రతినిధి పీరుబండు సత్యవతి, మౌంట్ ఫోర్ట్ సోషల్ ఇన్స్టిట్యూట్ కోర్డినేటర్ కె.వరలక్ష్మి పాల్గొన్నారు.

విజయనగరం : స్థానిక కెజిబివిలో జాతీయ బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ సత్యవతి మాట్లాడుతూ ఆడపిల్లలు అన్ని రంగాలలో ప్రతిభ కనబరిచి, సమాజానికి రోల్ మోడల్‌గా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపల్ సుజాత, బెజ్జిపురం యూత్‌క్లబ్ జిల్లా కోఆర్డినేటర్ ఝాన్సీ, ఐసిడిఎస్ సూపర్‌వైజర్లు ఎర్రయ్యమ్మ, అనురాధ, మేరీ, వనిత, అరుణ, రమణమ్మ, కెజిబివి సిబ్బంది పాల్గొన్నారు.

విధుల్లోకి సర్వేయర్లు

ప్రజాశక్తి-విజయనగరం కోట

సర్వే, భూ రికార్డుల శాఖ ఉద్యోగులు శుక్రవారం విధుల్లో చేరారు. తమ సమస్యల పరిష్కారం కోసం నాలుగు రోజుల పాటు సర్వే ఉద్యోగులు పెన్‌డౌన్ చేపట్టిన విషయం తెలిసిందే. గురువారం వారి సమస్యలపై మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దృష్టికి తీసుకెళ్లారు. సర్వే అధికారి సరెండర్‌ను రద్దు చేయాలని, సర్వేయర్లకు, ఉప సర్వే పరిశీలకులకు జారీ చేసిన మెమోలను వెనక్కి తీసుకోవాలని సర్వే యూనియన్ నాయకులు చౌదరి వెంకటరావు కోరారు. వారి సమస్యలను విన్న మంత్రి శ్రీనివాస్ పరిష్కారానికి హామీనిచ్చారు. దీంతో శుక్రవారం జిల్లా వ్యాప్తంగా సర్వేయర్లు విధుల్లోకి చేరారు. నాలుగు రోజులుగా ఆగిపోయిన రీసర్వే ప్రారంభమైంది.

హమాలీల నిరసన

ప్రజాశక్తి-విజయనగరంకోట

కూలి రేట్లు పెంచాలని కోరుతూ సివిల్ సప్లై హమాలీల సంఘం ఆధ్వర్యాన శుక్రవారం నగరంలోని దాసన్నపేట పౌరసరఫరాల గోడౌన్ వద్ద హమాలీలు నిరసన చేపట్టారు. ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పి.కామేశ్వరరావు మాట్లాడుతూ హమాలీలకు కూలి రేట్లు పెంచడానికి ఏడాది క్రితం ఒప్పందం చేసుకున్నా నేటికీ జిఒ జారీ చేయకపోవడం అన్యాయమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే జిఒ జారీ చేయాలని, బకాయి ఎరియర్స్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే నిరవధికంగా పని నిలిపేస్తామని హెచ్చరించారు ఈ కార్యక్రమంలో హమాలీలు పాల్గొన్నారు.

ఇరిగేషన్ ఎస్ఇగా అప్పారావు

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలి ఇరిగేషన్ ఎస్ఇగా ఆర్.అప్పారావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ధవళేశ్వరం పోలవరం డివిజన్-8 ఇఇగా పనిచేసిన అప్పారావుకు ఎస్ఇగా ఉద్యోగోన్నతి కల్పించడంతో బాధ్యతలు స్వీకరించారు. సాగునీటి ప్రాజెక్టులు ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్‌కు చర్యలు తీసుకుని రైతులకు సాగునీరు అందిస్తామని ఆయన చెప్పారు. జంఝావతి ప్రాజెక్టు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. నూతన ఎస్ఇ అప్పారావుకు సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు.

దుకాణాల్లో తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం

నగరంలోని పలు వ్యాపార సంస్థల్లో శుక్రవారం లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ ఎం.దామోదర నాయుడు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ తనిఖీల్లో తూనిక యంత్రాలకు సీళ్లు లేకపోవడం, దుకాణాల్లో ప్యాకింగ్ చేసి విక్రయానికి ఉంచిన వాటిపై తయారీ కంపెనీ చిరునామా, తేదీ, గరిష్ట అమ్మకపు ధర, ఇతర వివరాలు ఉన్నవో, లేవో పరిశీలించారు. 8 మందిపై కేసులు నమోదు చేశారు. అనంతరం వి.టి అగ్రహారంలోని నాలుగు అంగన్వాడీ కేంద్రాలు, నగర పాలక సంస్థ పాఠశాలలో తనిఖీలు చేపట్టారు. పిల్లలకు ఇచ్చే కోడి గుడ్లు, బాలామృతం, వేరుశనగ చిక్కీ, పాల ప్యాకెట్లు, ఆయిల్ ప్యాకెట్లు తూకం వేసి, సరిచూశారు. ఈ తనిఖీల్లో టెక్నికల్ అసిస్టెంట్ సత్యనారాయణ, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

కుళాయి కనెక్షన్ల కోసం 28న ధర్నా

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పేదలకు రూ.200 కుళాయి కనెక్షన్లు ఇవ్వాలని ఈ నెల 28న నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు సిపిఎం నగర కార్యదర్శి రెడ్డి శంకరరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎల్‌బిజి భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నగరంలో అయ్యప్పనగర్, ఎల్‌బిజి నగర్, రామకృష్ణనగర్, తోటపాలెం వైఎస్ఆర్ కాలనీ ఏర్పడి 20 ఏళ్లు కావస్తున్నా నేటికీ కుళాయిలకు నోచుకోలేదన్నారు. ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ఇవ్వడమే లక్ష్యమని చెబుతున్న పాలకులు, అధికారులు ఆచరణలో అమలు చేయడం లేదన్నారు. దీంతో తాగునీటి కోసం ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే అవకాశంగా పుట్టగొడుగుల్లా మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటుచేసి, ప్రజలను దోచుకుంటున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ కార్యాలయం వద్ద చేపడుతున్న ధర్నాను పేదలు, మధ్య తరగతి ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ధర్నా వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో సిపిఎం నాయకులు పి.రమణమ్మ, బి.రమణ, రామచంద్రరావు, వి.లక్ష్మి పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాల దుకాణాలపై నగరపాలక సంస్థ ప్రజారోగ్య సిబ్బంది దాడులు చేపట్టారు. భారీ మొత్తంలో ప్లాస్టిక్ సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, పారిశుధ్య పర్యవేక్షకులు, సిబ్బంది మూకుమ్మడి దాడులను నిర్వహించారు. సింగల్ యూజ్ ప్లాస్టిక్‌తోపాటు నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు సుమారు 465 కిలోలను స్వాధీనం చేసుకున్నారు. రూ.25 వేల జరిమానాలు విధించారు. వాస్తవానికి ఈ నెల ఒకటో నుంచి నగరంలో సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తామని ప్లాస్టిక్ విక్రేతల వద్ద కమిషనర్ నల్లనయ్య స్పష్టం చేశారు. ఇదే ఆఖరి అవకాశమని కూడా కమిషనర్ తెలిపారు. అందుకు అంగీకరించిన విక్రయదారులు కొంత గడువును కోరారు. అయినా కొందరు బేఖాతరు చేస్తూ నిషేధిత ప్లాస్టిక్ వస్తువుల విక్రయాలను చేపట్టడంతో శుక్రవారం సరుకులను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న సరుకులను మధురవాడలో ఉన్న జిందాల్ వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్‌కు తరలించామని కమిషనర్ తెలిపారు.

పూర్తి సమాచారంతో హాజరుకండి

రెవెన్యూ అధికారులపై మంత్రి మండిపాటు

ప్రజాశక్తి-దత్తిరాజేరు

సమీక్షా సమావేశానికి హాజరైనప్పుడు పూర్తి సమాచారంతో అధికారులు రావాలని చిన్నతరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ హెచ్చరించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రాజేంద్రప్రసాద్ ఆధ్వర్యంలో మంత్రి మండల స్థాయి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇటీవల జరిగిన రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన వినతులతోపాటు ఎంతవరకు పరిష్కారం చేపట్టారు? గత ప్రభుత్వంలో జరిగిన గ్రామ రెవెన్యూ సర్వేలో లోపాలు, అపరిష్కృత రెవెన్యూ సమస్యలు, వంటి వివరాలు మంత్రి అడగగా, పూర్తి సమాచారం లేకపోవడంతో తహశీల్దార్, సర్వేయర్‌పై అసంతృప్తి వ్యక్తం చేశారు. మరో అరగంటలో పూర్తి సమాచారంతో హాజరు కావాలని ఆదేశించారు. ఉపాధి హామీ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులను ఎపిఒ వెంకట అప్పలనాయుడు వివరించగా, పని దినాలు తక్కువగా ఉన్నాయని, రోజువారి వేతనం పెంచేలా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. మండలంలో 12 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించినట్లు ఎఒ అనురాధ తెలిపారు. 3 వేలు మెట్రిక్ టన్నుల సేకరణకు ఇండెంట్ అవసరం ఉందని తెలిపారు. ఉన్నతాధికారులతో మాట్లాడి ఆదిశగా చర్యలు చేపడతామని మంత్రి చెప్పారు. పైలెట్ ప్రాజెక్టు ద్వారా బాడంగి మండలం పాల్తేరు వద్ద వేగావతి నది నుంచి మండలంలో 45 గ్రామాలకు తాగునీరు అందిస్తున్నట్లు ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ కార్తీక్ తెలిపారు. కొన్నిచోట్ల మరమ్మతుల కారణంగా వాటిలో 15 గ్రామాలకు నీరు సకాలంలో అందివ్వలేక పోతున్నామని చెప్పారు. రూ.45 లక్షలు మంజూరు చేశామని, సమస్యలను పరిష్కరించి తాగునీరు అందేలా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. పాల్తేరు వద్ద వేగావతి నదిలో నీరు పంపింగ్ చేసే వెల్స్ సమీపంలో వందల కొద్దీ ట్రాక్టర్లతో ఇసుక తరలించుకు పోతున్నారని జెఇ.. మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన మంత్రి ఉన్నతాధికారులతో మాట్లాడి, అక్కడ పరిస్థితులపై ఆరాతీసి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపిపి గేదెల సింహాద్రి అప్పలనాయుడు, జెడ్‌పిటిసి రౌతు రాజేశ్వరి, వైస్‌ఎంపిపి మిత్తిరెడ్డి రమేష్ పాల్గొన్నారు.

సమావేశంలో పాల్గొన్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

టిడిపి కార్యకర్తలకు పరామర్శ

మండలంలో చిన్న చామలాపల్లె గ్రామంలో ఇటీవల జరిగిన కొట్లాటలో గాయాలైన టిడిపి కార్యకర్తలను మంత్రి కొండపల్లి శ్రీనివాస్ శుక్రవారం పరామర్శించారు. సంఘటన వివరాలను అడిగి తెలుసుకుని వారికి మనోధైర్యం కల్పించారు. జరిగిన సంఘటనపై పూర్తి దర్యాప్తు చేపట్టాలని పోలీసులు ఆదేశించారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు చప్ప చంద్రశేఖర్, మాజీ వైస్ ఎంపిపి పెద్దింటి మోహన్ రావు పాల్గొన్నారు.

సూర్యనారాయణకు అవార్డు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రముఖ మానసిక నిపుణులు ఎన్.వి.స్.సూర్యనారాయణకు ఇండియన్ స్కూల్ సైకాలజీ అసోసియేషన్ లీడర్‌షిప్ అవార్డును ప్రదానం చేసింది. శుక్రవారం పుదుచ్చేరి విశ్వవిద్యాలయంలో జరిగిన 'హిప్నోసిస్ ఎక్రాస్ లైఫ్ స్పాన్ : ప్రమోషన్, ప్రివెన్షన్ అండ్ ఇంటర్వెన్షన్' అనే అంశం పై ఏర్పాటుచేసిన సదస్సు సందర్భంగా కేంద్ర ప్రజా సమాచార, ప్రసార శాఖ మంత్రి ఎల్.మురుగన్, పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ ఆర్.సెల్వం, పుదుచ్చేరి విద్యా శాఖా మంత్రి ఎ.నమశివాయమ్.. సూర్యనారాయణకు అవార్డును అందజేశారు. సూర్యనారాయణకు అవార్డు లభించడంపై పలువురు విద్యావేత్తలు అభినందించారు.

అవార్డు అందుకుంటున్న సూర్యనారాయణ

డ్రోన్ వినియోగం క్రియాశీలకం

ప్రజాశక్తి-విజయనగరంకోట

క్షేత్ర స్థాయిలో నేరాలను నియంత్రించేందుకు డ్రోన్ వినియోగం క్రియాశీలకంగా మారనుందని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. డ్రోన్ వినియోగించడంలో 30 మంది పోలీసు కానిస్టేబుళ్లకు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ త్వరలో ప్రతీ పోలీసు స్టేషనుకు ఒక డ్రోన్‌ను ఇవ్వనున్నట్లు తెలిపారు. క్షేత్ర స్థాయిలో ఓపెన్ డ్రింకింగ్, గంజాయి, పేకాట, కోడి వందాల నియంత్రణకు, క్రౌడ్, ట్రాఫిక్ మేనేజ్మెంట్ చేసేందుకు, పండగలు, ముఖ్య నాయకుల భద్రత, ముఖ్యమైన బందోబస్తుల్లో డ్రోన్లను వినియోగిస్తామన్నారు. ఒక డ్రోన్ సుమారు 20 మంది పోలీసులు చేసే పనిని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్‌బి సిఐలు ఎ.వి.లీలారావు, ఆర్.వి.ఆర్.కె.చౌదరి, ఆర్ఐలు ఎన్.గోపాలనాయుడు, శ్రీనివాసరావు, ఆర్ఎస్ఐ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణకు హాజరైన కానిస్టేబుళ్లతో మాట్లాడుతున్న ఎస్‌పి వకుల్ జిందాల్

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు

పోలీసు సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎస్‌పి వకుల్ జిందాల్ తెలిపారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో పోలీసు వెల్ఫేర్ డే నిర్వహించారు. సిబ్బంది నుంచి ఎస్‌పి వినతులు స్వీకరించి, పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు సంక్షేమానికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు.

సీతంలో సెమినార్

ప్రజాశక్తి-విజయనగరం

స్థానిక సీతం ఇంజినీరింగ్ కళాశాలలో 'పరిశోధనా పత్రాలు రచన, అవగాహన, వివిధ పరిశీలనలు' అనే అంశంపై శుక్రవారం సెమినార్ నిర్వహించారు. పుదుచ్చేరికి చెందిన ఎంఎస్‌హెచ్ రీసెర్చ్ అకాడమీ మేనేజింగ్ డైరెక్టర్ టి.రాజ సంతోష్ కుమార్ మాట్లాడుతూ పరిశోధన పత్రాలు ఎలా రాయాలి, రిజిస్ట్రేషన్ ప్రక్రియ, పేపర్ పబ్లికేషన్స్ ఎలా చేయాలి, పరిశోధన పత్రం కీలక పరిశీలనలు, తదితర వాటిపై మెలకువల గురించి అధ్యాపకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ డాక్టర్ మజ్జి శశిభూషణరావు, ప్రిన్సిపల్ డాక్టర్ డి.వి రాము మూర్తి, డీన్ అకడమిక్స్ డాక్టర్ వై.నరేంద్ర కుమార్, తదితరులు పాల్గొన్నారు.

లింగంపేటలో పశువైద్య శిబిరం

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని లింగంపేటలో శుక్రవారం పశువైద్య శిబిరాన్ని నిర్వహించినట్లు పశువైద్యాధికారి డాక్టర్ కోరాడ గాయత్రి తెలిపారు. ఇందులో భాగంగా 10 కృత్రిమ గర్భధారణ ఇంజక్షన్లు, 35 చూలు తనిఖీలు, 34 గర్భకోస వ్యాధులకు చికిత్సలు, 71 పెయ్యలు, 160 పడ్డలకు నట్టల నివారణ మందులు పంపిణీ చేశామన్నారు. ఈ శిబిరాన్ని జిల్లా బహుళార్ధ పశువైద్యశాల డిప్యూటీ డైరెక్టర్ మహాలక్ష్మి, జిల్లా పశు వ్యాధి నిర్ధారణ అసిస్టెంట్ డైరెక్టర్ రాంప్రసాద్ సందర్శించారు

జాగ్రత్తలతోనే ప్రమాదాల నివారణ

ప్రజాశక్తి- శృంగవరపుకోట

ముందు జాగ్రత్తలతోనే ప్రమాదాలను నివారించవచ్చునని ఆర్‌టిసి డిపో మేనేజర్ కె.రమేష్ తెలిపారు. రహదారి భద్రతా మాసోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక డిపోలో హ్యాపీ డ్రైవర్స్ డే కార్యక్రమం నిర్వహించి డ్రైవర్లందరికీ థాంక్యూ చెబుతూ పుష్ప గుచ్చాలు, స్వీట్స్ అందజేశారు. ఈ సందర్భంగా ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. అనంతరం రహదారి భద్రతకు డ్రైవర్స్ పాటించవలసిన నియమాలు పొందుపరిచిన ప్లకార్డులతో ఆర్‌టిసి కాంప్లెక్స్ నుండి దేవి కూడలి వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సూపరింటెండెంట్ వెంకటరావు, సెక్యూరిటీ హెడ్ గార్డ్, ఇతర ట్రాఫిక్ గ్యారేజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన ఉండాలి

రామభద్రపురం: విద్యార్థి దశ నుంచే ఓటు హక్కుపై అవగాహన ఉండాలని తహశీల్దార్ సులోచనారాణి తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంఇఒ తిరుమల ప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మండల స్థాయి వ్యాసరచన, వక్తృత్వం, పాటల, ముగ్గుల పోటీలు నిర్వహించారు. వ్యాసరచన పోటీల్లో వసుశ్రీ, గోపిక శ్రీవల్లి గెలుపొందగా వక్తృత్వ పోటీల్లో ఉమేష్, వాసవి ప్రథమ ద్వితీయ స్థానాల్లో గెలుపొందారు. పాటల పోటీలో దీక్షిత, కిరణ్ కుమార్ గెలుపొందారు. వీరికి జిల్లా కలెక్టర్ ద్వారా వచ్చే ప్రశంసా పత్రాలతో పాటు బహుమతులను శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో అందజేయనున్నట్లు తహశీల్దార్ తెలిపారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతగా జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు దాలినాయుడు వ్యవహరించారు.

బొబ్బిలిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి

బొబ్బిలి: బొబ్బిలిని పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఏపీ ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు అన్నారు. బొబ్బిలి యుద్ధం జరిగి 268 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా శుక్రవారం బొబ్బిలి మ్యూజియంను సందర్శించారు. ఆనాటి ఆయుధాలు, అప్పటి చరిత్ర గురించి గుర్తు చేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ జనవరి 25 జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉత్తరాంధ్రలో బొబ్బిలి, విజయనగరంలో చారిత్రక కట్టడాలు, మన్య ప్రాంతంలో ప్రకృతి అందాల జలపాతాలు తరహా చాలా పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని వీటినీ సర్క్యూట్‌గా గుర్తించి ప్రభుత్వం సౌకర్యాలు కల్పిస్తే పర్యాటక అభివృద్ధి జరుగుతుందని అన్నారు.

పాఠశాలలను సందర్శించిన ఎంఇఒలు

వేపాడ: మండలంలోని జాకేరు, ప్రాథమికోన్నత పాఠశాల, ఎన్‌కేఆర్ పురం ప్రాథమిక పాఠశాలను ఎంఇఒలు ఎన్ నాగభూషణరావు, పి బాల భాస్కర రావులు శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా రీడింగు, తరగతి గదులు, టాయిలెట్స్ పరిశీలించారు. విద్యార్థులతో ఇంగ్లీషు తెలుగు చదివించడం, పాఠశాల రికార్డులు పరిశీలన చేశారు.

వేపాడలో హెచ్‌ఎంల సమావేశం

వేపాడ: మండలం కేంద్రంలోని విద్యావనరుల శాఖ కార్యాలయంలో వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలతో ఎంఇఒలు ఎస్ నాగభూషణరావు, పి.బాలభాస్కరరావుల సమావేశం నిర్వహించారు. ప్రధానంగా పాఠశాలల్లో విద్యార్థులతో ఉపాధ్యాయులు స్నేహభావంతో మెలగాలని, ఎప్పటికప్పుడు రికార్డులు సిద్ధం చేసుకోవాలని, పాఠశాల ఆవరణ అంతా ఆహ్లాదకరంగా ఉండాలని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకంలో ఏ విధమైన లోపం ఉండకూడదని తెలిపారు. ఈ సమావేశంలో ఉపాధ్యాయులతో పాటు సిఆర్‌పిలు తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి బోరు బావి ఏర్పాటు

వేపాడ: మండలంలోని బక్కునాయుడుపేట కెజిబివి బాలికల వసతి గృహంలో వేపాడ సచివాలయం నిధుల నుండి గ్రామ సర్పంచ్ ఎం అర్జునమ్మ, వార్డు మెంబర్ యం రమణ ఆధ్వర్యంలో శుక్రవారం తాగునీటి బోరుబావి ఏర్పాటు చేశారని ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ వి. దేవి తెలిపారు. దీంతో వసతి గృహం ప్రిన్సిపల్ కిరణ్మయితో పాటు ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు గ్రామ సర్పంచ్‌కు అభినందనలు తెలిపారు.

1,101 పింఛన్లు పరిశీలన

బాడంగి: మండలంలోని 1,101 పింఛన్లను పరిశీలించామని ఎంపిడిఒ శంబంగి రామకృష్ణ తెలిపారు. తన కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 1101 వికలాంగ పింఛన్లు వస్తున్నాయన్నారు. వీరికి ఫిబ్రవరి 11 నుంచి జూన్ 9 వరకు విజయనగరం, రాజాం ఆసుపత్రిలలో పరిశీలన జరుగుతుందని, పూర్తి వివరాలకు సచివాలయాలను సంప్రదించాలని కోరారు.

కూలి రేట్లు పెంచాలి

బొబ్బిలి: రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లై శాఖ ద్వారా సివిల్ సప్లైస్ హమాలీ కార్మికులకు కూలి రేట్లు పెంపు జిఒఉన వెంటనే జారీ చేయాలని ఎపి సివిల్ సప్లయ్ హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ముల్లు నర్సింహులు, జట్టు మేస్త్రిలు పొందూరు గోపి, మెండి నర్సింగరావు, వద్ది నాగరాజు కోరారు. ఏపీ సివిల్ సప్లయ్ గోదాం వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం సంబంధిత సివిల్ సప్లయ్ అధికారుల ద్వారా జీవో జారీ చేసి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సంవత్సరం కాలంగా కార్మికులకు రావలసిన రాయితీలు మంజూరు చేయాలని కోరారు.

విజేతలకు బహుమతులు

వేపాడ: మండల కేంద్రంలో శ్రీసాంబశివ మహోత్సవం సందర్భంగా రంగవల్లుల పోటీలు నిర్వహించి విజేతలకు ఉత్సవ కమిటీ సభ్యులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

మెరకముడిదాం: మండలంలోని కెజిబివిలో పదో తరగతి విద్యార్థులకు హైదరాబాద్‌కు చెందిన బాలమిత్ర ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు స్టడీ మెటీరియల్‌ను చక్కగా ఉపయోగించుకొని మంచి మార్కులు సాధించాలని కోరారు. బాలిక దినోత్సవం సందర్భంగా అంగన్‌వాడీ సూపర్ వైజర్ శ్రీదేవి, లక్ష్మి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో కెజిబివి ప్రిన్సిపాల్ గౌస్యబేగం, బాలమిత్ర ఫౌండేషన్ సిబ్బంది, సిఆర్‌పి శంకర్ పాల్గొన్నారు.

రాత్రి బడులు ప్రారంభం

రేగిడి: మండలంలోని చిన్న శిర్లాం, తునివాడ, వెంకంపేట తదితర గ్రామాల్లో ఉల్లాస్ పేరుతో నిరక్షరాశులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని శుక్రవారం రాత్రి నుంచి బడులు ప్రారంభించారు. మహిళా సంఘ సభ్యులు, వంట నిర్వాహకులు, పారిశుధ్య కార్మికులు రాత్రి బడిలో చేరారు. ఒక వాలంటీర్ ఉపాధ్యాయుడు పదిమందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ఉల్లాస్ కార్యక్రమం ఉద్దేశం అని ఎపిఎం బాసిన గోవిందరావు తెలిపారు.

కర్పూరికి ఘన నివాళి

విజయనగరం టౌన్ : భారతరత్న అవార్డు గ్రహీత కర్పూరి ఠాగూర్ 101వ జయంతిని నగరంలోని అంబేద్కర్ భవన్‌లో నాయీబ్రాహ్మణ సంఘం, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. కర్పూరి ఠాగూర్ చిత్రపటానికి నాయీబ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.వి దుర్గారావు, భీమసేన నాయకులు పి.వెంకటరమణ, రెల్లి కులాల సంఘం నాయకులు చెన్నా బంగారురాజు, డిహెచ్‌పిఎస్ నాయకులు రేగేటి సంతోష్ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ముద్దాయికి 5 నెలల జైలుశిక్ష

విజయనగరం కోట: ఇటీవల విజయనగరం రైల్వేస్టేషన్ పరిధిలో దొంగతనం కేసులో అరెస్టయిన షేక్ రసూల్‌కు ఐదు నెలల జైలుశిక్ష విధించినట్లు జిఆర్‌పి ఎస్ఐ వి.బాలాజీరావు తెలిపారు. విశాఖపట్నం రైల్వే కోర్టు జడ్జి అనురాగ్ కొమ్మాది.. రిమాండ్‌లో ఉన్న ముద్దాయికి ఐదు నెలల సాధారణ జైలు శిక్ష విధించినట్లు వివరించారు.

ఆప్టా కేలెండర్ ఆవిష్కరణ

విజయనగరం టౌన్ : ఆంధ్రప్రదేశ్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా) డైరీ, కేలెండర్‌ను డిఇఒ యు.మాణిక్యంనాయుడు శుక్రవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆప్టా జిల్లా అధ్యక్షులు ఎస్ భాస్కర్ రావు, ప్రధాన కార్యదర్శి వి.రమణ, ఆర్థిక కార్యదర్శి కె.సుకుమార్, కార్యదర్శి ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు. ఎస్‌జిటి బదిలీల్లో మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించేలా ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని ఈ సందర్భంగా డిఇఒను వారు కోరారు.

మామిడి పూతకు మంచు దెబ్బ

- వర్షాన్ని తలపిస్తున్న మంచుతో మాడిపోతున్న పూత
- పలుచోట్ల రాలిపోతున్న పింజెలు
- ఆందోళనలో రైతులు

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గతేడాది చివరిలో కురిసిన అకాలవర్షాలతో పాటు గత కొద్దిరోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న పొగమంచు మామిడి రైతులను నిండా మంచేసింది. దీంతో మామిడి రైతుల ఆశలు ఈ ఏడాది కూడా అడియాసలయ్యాయి. పొగ మంచుకు మామిడిపూత మాడిపోతుంది. వేలాది రూపాయలు ఖర్చుచేసి చీడపీడల సమస్యల నుండి తప్పించుకుంటూ సస్యరక్షణ చేపడుతున్న రైతులకు మంచు, అకాల వర్షాలు పూతరాన్వికుండా అడ్డుపడుతున్నాయి. దీంతో అప్పులు చేసి మదుపులు పెట్టిన రైతులు ఆందోళన చెందుతున్నారు.

పూసపాటిరేగ, డెంకాడ, భోగాపురం మండలాల్లో సుమారుగా 3 వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఏటాలాగే ఈ ఏడాది కూడా రైతులు ముందుగానే సస్యరక్షణ చేపట్టారు. డిసెంబర్, జనవరి నెలల్లో మామిడి పూత మొదలవుతోంది. అయితే రైతులు ముందుగా పూత వచ్చేందుకు వేలాది రూపాయిలు ఖర్చుచేసి మందులు పిచకారీ చేశారు. డిసెంబర్‌లోనే పూత ఆశాజనకంగా వచ్చేసింది. ఈ నేపథ్యంలో డిసెంబర్‌లో కురిసిన అకాల వర్షం మామిడిపూతను రాల్చేసింది. దాన్ని తట్టుకొని పూత ఏపుగా వస్తుందన్న సమయంలో పొగమంచు దాడి చేస్తుంది. దీంతో పూత మాడిపోయి మొండి రెమ్మలు దర్శనమిస్తున్నాయి. కళ్లముందే మాడిపోతున్న పూతను చూసి రైతులు లబోదిబోమంటున్నారు. ఈ ఏడాది కూడా నష్టం తప్పదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉద్యానవన శాఖాధికారులు ఆదుకోవాలని కోరుతున్నారు.

మంచు దెబ్బకు మాడిపోయిన మామిడి పూత

ఈ ఏడాది పంట పోయినట్టే

నేను 12 ఎకరాలు తోటను లీజుకు తీసుకున్నాను. ఈ ఏడాది పంటపోయినట్లే. ఎందుకంటే ఈ ఏడాది డిసెంబర్‌లో పూత వచ్చేసింది. అయితే డిసెంబర్‌లో అకాల వర్షంతో పూత మొత్తం రాలిపోయింది. అరకొర ఉన్న పూత మంచు వల్ల మాడిపోయింది. ఇప్పటి వరకూ ఒక్క పింజకూడా కట్టలేదు. ఎకరాకు సుమారుగా 20 వేలకు పైగానే మదుపు అయ్యింది. ఇంకా మందులు కొట్టాలి. కానీ ఆపేసాం. మందులు డబ్బులు కూడా రావని అర్థం అయ్యింది. సుమారుగా రెండు లక్షలు అప్పులు పాలయిపోయినట్లే.

వలిరెడ్డి రామకృష్ణ, లీజుదారు, లోవజగన్నాదపురం

పింజరాలిపోతుంది

మాకు ఆరు ఎకరాలు మామిడి తోట ఉంది. ఈ ఏడాది ఎవరూ లీజుకు తీసుకోలేదు. దాంతో మేమే సాగుచేస్తున్నాం. ఈ ఏడాది మామిడికి చేయాల్సిన సస్యరక్షణ అంతా చేసాం. కానీ దేవుడు కరుణించలేదు. వాతావరణం అనుకూలించకపోవడంతో పూత మాడిపోతుంది. పింజకూడా నిలబడడం లేదు. రూ.3 లక్షలు నష్ట పోయినట్లే. ఆశతో ఇంకా మందులు కొడుతున్నాం.

కె. చొన్నయ్య, రైతు , రెల్లివలస, పూసపాటిరేగ

మంచుతో నష్టపోతున్న రైతులను ఆదుకోవాలి

శృంగవరపుకోట: తేనె మంచు వల్ల జీడి మామిడి పంట రైతులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉన్నందున పంటను నష్టపోయిన రైతన్న లను ప్రభుత్వాలు ఆదుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మద్దిల రమణ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ. చలికాలం కారణంగా ఇటీవల మంచు విపరీతంగా కురుస్తుందని ఈ తేనెమంచు కురవడం వల్ల జీడి మామిడి తోటల పువ్వు రాలిపోయి రైతుకు నష్టం ఏర్పడుతుందని ఇప్పటికే ప్రభుత్వం జీడి రైతుకు మద్దతు ధర ఇవ్వటం లేదని అన్నారు. ఇప్పుడు మంచు వల్ల పువ్వు రాలిపోతే జీడి రైతుకి మరింత నష్టం ఏర్పడుతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులు జాగ్రత్త పాటించాలి

పొగమంచు మామిడికి ఇబ్బందిగా ఉంది. అయితే మామిడి రైతులు నష్టం వాటిల్లకుండా మేమిచ్చే సూచనలు పాటించాలి. పూత దశలో ఉన్నప్పుడే ఇమిడా 0.5 ఎంఎల్, మిథైల్‌డిమటాన్ 2ఎంఎల్, సాఫ్2 గ్రాములు మందును లీటర్ నీటిలో కలిపి పిచకారీ చేయాలి. నల్లపూత దశలో ఉన్నప్పుడు సిప్రోనిల్2 ఎంఎల్, ఎంత్రాకాల్ 2.5 గ్రాములు లీటర్ నీటిలో కలిపి పిచికారి చేయాలి. మంచి ఫలితం ఉంటుంది.

జ్యోత్స్న, ఉద్యానవణశాఖాధికారి, భోగాపురం.

కలిసికట్టుగా అభివృద్ధి పనులు: ఎంపి

కొత్తవలస: శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపి శ్రీభరత్, జెడ్‌పి చైర్మన్, ఎమ్మెల్యే

ప్రజాశక్తి - కొత్తవలస

అభివృద్ధి పనులంతా కలిసి చేసుకోవాలని విశాఖ ఎంపి మోతుకుపల్లి శ్రీ భరత్ అన్నారు. జిల్లా పరిషత్ వారపు సంతలో సుమారు 78 లక్షల రూపాయలతో నిర్మించిన షాపింగ్ కాంప్లెక్స్‌ను జిల్లా పరిషత్తు చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారితో కలిసి ఆయన శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాలంతా కలిసికట్టుగా చేసుకోవాలని, విభేదాలు లేకుండా అభివృద్ధి సాధించాలని అన్నారు. ఎవరు రాజకీయాలు వారే చేసుకోవాలని, గ్రామాల అభివృద్ధికి అందరూ కృషి చేయాలని ఎంపి చెప్పారు. ఈ షాపింగ్ కాంప్లెక్స్ వల్ల పంచాయతీకి, జిల్లా పరిషత్‌కు అధిక ఆదాయం సమకూరుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి నీలంశెట్టి గోపమ్మ, జెడ్‌పిటిసి నెక్కల శ్రీదేవి, కొత్తవలస మేజర్ పంచాయతీ సర్పంచ్ మచ్చ ఎర్రయ్య రామస్వామి, మాజీ ఎంపిపి గొరపల్లి శివ, టిడిపి మండల అధ్యక్షుడు గొరపల్లి రాము, రాష్ట్ర వెలమ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నెక్కల నాయుడు బాబు తదితరులు పాల్గొన్నారు.

మారిక రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

వేపాడ: మండలంలోని కరకవలస పంచాయతీ పరిధిలోని మారిక గిరిజన గ్రామానికి రూ.7కోట్లతో ఎంపి భరత్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. ముందుగా గిరిజనులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. గిరిజన గ్రామానికి చెందిన వీర్రాజు ఎంపితో మాట్లాడుతూ గ్రామంలో తమకు తెలియకుండా భూములు సర్వే చేసి ఇతర గ్రామస్తులు పేరున తమ భూములు రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారని తమ సమక్షంలో సర్వే జరిపి తమ భూములు తమకు వచ్చేలా తగు చర్యలు తీసుకోవాలని కోరారు. వెంటనే స్పందించిన ఎంపి జిల్లా కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, తహశీల్దార్ రాములమ్మను పిలిచి ఈ విధానంపై తక్షణమే తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు, టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప కృష్ణ, టిడిపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కోళ్ల బుచ్చి రాంప్రసాద్, టిడిపి మండల అధ్యక్షులు గొంప వెంకటరావు, నాయకులు కె.రమణమూర్తి, గుమ్మడి భారతి, సేనాపతి గణేష్, జెడ్‌పిటిసి సేనాపతి అప్పలనాయుడు, ఎంపిపి డి సత్యవంతుడు, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమలతో ఉపాధి అవకాశాలు

లక్కవరపుకోట: ఉపాధి అవకాశాలు రావాలంటే పరిశ్రమలు తెచ్చుకోవాలని ఎంపి ఎం.శ్రీభరత్ అన్నారు. శుక్రవారం మండలంలోని ఆర్జీపేటలో ఉపాధి హామీ నిధులు రూ.20.8 లక్షలతో నిర్మించిన వెల్నెస్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. నర్సంపేటలో ఉపాధి హామీ నిధులు రూ. 50లక్షలతో 800 మీటర్లు కొంపల్లికి వెళ్లే రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం మార్లపల్లి ఫామ్‌హౌస్‌లో నిర్మించిన ఎల్జి రిసార్ట్ ప్రారంభించారు. ఆర్జీపేటలో గ్రామస్తుల విన్నపం మేరకు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహ నిర్మాణం, సామాజిక భవనం నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గేదెల అప్పన్న దొర, నాయకులు తుంపాల అప్పన్న దొర, శేషావతారం, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కోళ్లపై ఎంపికి ఫిర్యాదు

వేపాడ: మండలంలోని మారిక గిరిజన గ్రామానికి వేయనున్న రోడ్డు శంకుస్థాపనకు హాజరైన ఎంపి శ్రీభరత్‌కు ఎమ్మెల్యే కోళ్లలలితకుమారిపై బొద్దాం సర్పంచ్ ఎర్ర రామసత్యవతి, మాజీ సర్పంచ్ జనపరెడ్డి ఈశ్వరమ్మ పలువురు మహిళలు ఫిర్యాదు చేశారు. మొదటి నుంచి టిడిపిలో ఉండి సర్పంచులుగా కొనసాగుతున్న తమను ఎన్నికలు అయినంత వరకు ఎమ్మెల్యే లలిత కుమారి ఉపయోగించుకుని అధికారంలోకి వచ్చిన తర్వాత తమను ఖాతరు చేయడం లేదన్నారు. తమ గ్రామంలో ఎమ్మెల్యే ఒక గ్రూపును ఏర్పాటు చేసుకొని వైసిపి నుంచి వచ్చిన వారికి అభివృద్ధి పనులు కట్టబెడుతున్నారని, ఏ సమస్య వచ్చినా పట్టించుకోకుండా తమను గొంప కృష్ణ గ్రూపు అంటూ కించపరుస్తున్నారని చెప్పారు. అధికార పార్టీకి కాకుండా వైసిపి వాళ్లకు ఇళ్ల స్థలాలు ఇవ్వడంతో పాటు వారికే అన్ని బాధ్యతలను అప్పగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అధికారులను సైతం తమకు ఎటువంటి పనులూ చేయవద్దని హుకుం జారీ చేశారని చెప్పారు. తమ సమస్యలను విన్నవించుకోవడానికి ఎమ్మెల్యే నివాసానికి వెళ్తే పట్టించుకోకపోవడం తమకు బాధాకరంగా ఉందని ఎంపికు మొరపెట్టుకున్నారు. ఎంపి మాట్లాడుతూ మీ సమస్యలను వివరించడానికి గొంప కృష్ణను తీసుకొని పార్టీ కార్యాలయానికి నేరుగా రావాలని ఇది కేవలం రోడ్డు శంకుస్థాపన కార్యక్రమం అని ఇక్కడ ఆ పంచాయతీ వద్దని చెప్పారు.

యుద్ధ స్తంభం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే బేబినాయన

పౌరుషానికి చిహ్నంగా బొబ్బిలి యుద్ధం

ప్రజాశక్తి - బొబ్బిలి

బొబ్బిలి పౌరుషానికి చిహ్నంగా బొబ్బిలి యుద్ధం నిలుస్తుందని ఎమ్మెల్యే బేబినాయన అన్నారు. బొబ్బిలి యుద్ధ దినోత్సవం సందర్భంగా శుక్రవారం యుద్ధ స్తంభం వద్ద యుద్ధ వీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొబ్బిలి యుద్ధం జరిగి 268 ఏళ్లు పూర్తి అయిందని, 17 వేల ఫ్రెంచ్, విజయనగరం సైన్యాన్ని బొబ్బిలి సైన్యం 250 మంది మాత్రమే ఎదురించి వీర మరణం పొందారని చెప్పారు. బొబ్బిలి వీరులు వీరత్వాన్ని నిలబెట్టేందుకు పని చేస్తామన్నారు. అనంతరం తాండ్రపాపరాయ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బుడా చైర్మన్ తెంటు రాజా, కౌన్సిలర్లు, సర్పంచులు, ఎంపిటిసిలు టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అనుమతి పత్రాలు ఉంచాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో నిర్మాణంలో ఉన్న భవనాలు వద్దే అనుమతి పత్రాలను డిస్‌ప్లే బోర్డులో ఉంచాలని కమిషనర్ ఎల్.రామలక్ష్మి శుక్రశారం టౌన్ ప్లానింగ్ అధికారులను ఆదేశించారు. ఖాళీ స్థలాలకు పన్నులు చెల్లించిన తర్వాత మాత్రమే నిర్మాణాలకు అనుమతి ఇవ్వాలన్నారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇళ్ల నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షణ చేయాలని కోరారు. ఎల్‌ఆర్‌ఎస్ కోసం మార్చి 31లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఘనంగా జాతీయ బాలికల దినోత్సవం

ప్రజాశక్తి- తెర్లాం

ఐసిడిఎస్ పిఒ రాజ్యలక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం జాతీయ బాలికల దినోత్సవాన్ని మండలంలోని కుమ్మరిపేట కెజిబివిలో నిర్వహించారు. ఎంపిడిఒ ఆర్.రాంబాబు పిల్లలకు వ్యాసరచన, డ్రాయింగ్, క్విజ్ పోటీలను నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ త్రినాధరావు, ప్రిన్సిపల్ ఆదిలక్ష్మి, అంగన్వాడి సూపర్వైజర్లు ఉషారాణి, వెంకటలక్ష్మి, అంగన్వాడి సిబ్బంది, కెజిబివి పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వేపాడ: మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా బాల్య వివాహాలపై అవగాహన ర్యాలీ చేశారు. ఈ కార్యక్రమంలో వేపాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీవల్లి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు జి.కామేశ్వరి, పి.భాగ్యవతి, అంగన్వాడీ పాల్గొన్నారు.

శృంగవరపుకోట: ప్రపంచ బాలికల దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండలంలోని వెంకటరమణపేటలో బాల్య వివాహాల నిర్మూలనపై కిషోరి బాలికల తల్లులకు, తండ్రులకు అంగన్వాడి సూపర్వైజర్ టి.సుశీల అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు, పాల్గొన్నారు.

ఎస్‌కోట: ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

వంగర: జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8, 9 తరగతుల విద్యార్థినిలకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు శుక్రవారం నిర్వహించారు. వ్యాసరచనలో పి.రమాదేవి, పి.షర్మిల, ఎం.నికిత, వక్తృత్వ పోటీల్లో ఎం.భార్గవి, బి.కావ్య, బి.నందిని, ప్రియ గెలిపొందారు. వీరికి హెచ్‌ఎం ముద్దాడ రవణమ్మ బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు కుమారి, శశికళ, వెంకటరత్నం పాల్గొన్నారు.

కొత్తవలస: వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ బాలికల గురుకులంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస కుమారి ఆధ్వర్యంలో వైద్యధికారి డాక్టర్ గోపాలకృష్ణ బాలికా విద్య, ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో పి.హెచ్.ఎన్. జగదాంబ, హెచ్.వి. పద్మావతి, హెచ్.ఎస్.ఈశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఏ.ఎన్.ఎమ్. భవాని, ఉపాధ్యాయులు సుశీల, రోజారాణి, ఆశ, అంగన్వాడీ వర్కర్స్ పాల్గొన్నారు.

వేపాడ: ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు, విద్యార్థులు

రామభద్రపురం: బాలికల భద్రతా, రక్షణకు భరోసా ఇవ్వడం ప్రథమ కర్తవ్యం కావాలని ఎంపిడిఒ రత్నం తెలిపారు. అంతర్జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక కేజీ బీవీ విద్యాలయంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనంతరం విద్యారినులచే వివిధ ప్లకార్డులు ప్రదర్శించి, ప్రతిజ్ఞ చేయించారు. వివిధ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, అంగన్వాడీ, ఆశాలు పాల్గొన్నారు.

భోగాపురం: స్థానిక కెజిబివిలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ బాలికల దినోత్సవంలో ఎస్ఐ సూర్య కుమారి, ఎంఇఒ రమణమూర్తి, ఐసిడిఎస్ ఎసిడిపిఒ సత్యవతి, వైద్యాధికారి స్రవంతి పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అరుణ, సూపర్వైజర్లు శాంతి లత, నాగమణి, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

పొదుపు సంఘాల అవకతవకలపై దర్యాప్తు

ప్రజాశక్తి - బొబ్బిలిరూరల్

మండలంలోని కమ్మవలస పంచాయతీ పరిధిలోని ముత్తాయివలస గ్రామంలో పొదుపు సంఘాల అవకతవకలపై వచ్చిన ఫిర్యాదుపై శుక్రవారం స్త్రీనిధి ఎజియం ఉమామహేశ్వరరావు ఆధ్వర్యంలో దర్యాప్తు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీనిధి ఋణాల్లో అవకతవకలు జరిగాయని గ్రామస్తులు ఫిర్యాదు మేరకు వచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే గత మూడు రోజులుగా తమ సిబ్బంది దర్యాప్తు నిర్వహిస్తున్నారని, పూర్తి స్థాయి దర్యాప్తు వచ్చే సోమవారం నుండి నిర్వహించి దర్యాప్తు వివరాలు డిఆర్‌డిఎ పిడికి అందజేసి అవకతవకలు రుజువు అయితే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకొంటామన్నారు.

స్త్రీ నిధి ఋణ లక్ష్యం రూ.160 కోట్లు

జిల్లాలో స్త్రీనిధి ఋణ లక్ష్యం రూ.160 కోట్లుకు గాను ఇప్పటి వరకు రూ.155 కోట్లు ఋణాలు చెల్లించామని, మిగిలిన రూ.5 కోట్లు మార్చి నెలాఖరుకు పూర్తి చేస్తామన్నారు. రూ.10 వేల నుండి లక్ష వరకు రుణాలు ఇస్తామన్నారు. 28,778 మంది సభ్యులకు రుణాలను అందజేసామన్నారు. రుణాలు తీసుకొన్న వారు 24 నెలల్లో చెల్లించాలన్నారు. ఋణాలు తీసుకొన్న వారికి సురక్ష బీమా చేయిస్తామన్నారు. రికవరీ 97 శాతం ఉందని, మొండి బకాయిలు 0.4 శాతం ఉన్నాయన్నారు. ఇచ్చిన ఋణాలతో 126 రకాల వ్యాపారాలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం పి.భాగ్యలక్ష్మి, సిసిలు పాల్గొన్నారు.

దట్టంగా కురిసిన పొగ మంచు

ప్రజాశక్తి - భోగాపురం

జాతీయ రహదారిపై దట్టంగా పొగ మంచు కురిసింది. శుక్రవారం ఉదయం 9 గంటల వరకు పొగ మంచుతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. ఎదురుగా వెళ్తున్న వాహనాలు, వెనుక నుంచి వస్తున్న వాహనాలు, ఆగి ఉన్న వాహనాలు దగ్గరికి వస్తే గాని కనపడని పరిస్థితి నెలకొంది. దీంతో భోగాపురం పోలీస్ స్టేషన్ ఎదురుగా వంతెనపై ఆగి ఉన్న లారీని ఉదయం 6 గంటల ప్రాంతంలో వెనుక నుంచి ఆటో ఢీ కొట్టింది. పొగ మంచు కారణంగా వాహనం కనబడకే ఈ ప్రమాదం జరిగినట్లు డ్రైవర్ చెబుతున్నాడు. దీంతో ఆటోలో ఉన్న కమలాపండ్లు రోడ్డుపాలయ్యాయి. వెంటనే పోలీసులు చేరుకుని పరిస్థితిని చక్కదిద్దారు.

లారీని ఢీకొట్టి బోల్తా పడిన ఆటో

IN THE HONOURABLE SENIOR CIVIL JUDGE COURT AT VIZIANAGARAM
I.P.NO. 24/2024

Between:
Gadi Rajamani, W/o late GVN Prasad, LIG 28, APHB Colony, Vizianagaram....Petitioner
And:
Koppusetti Meghana alias Gowri and 2 others ....Respondents

To,
D-1. Koppusetti Meghana alias Gowri, W/o Ravi Kumar, aged about 35 years, plot no.95, first Floor, Sri Lakshmi Nalayam, PSR Colony, Vizianagaram.
D-2. Konuse Satish, S/o Sattibabu, aged about 30years, Gowdu Veedhi, Gosala, Viziangaram.
D-3. Rankireddy Satyanarayana, S/o late Apparao, aged about 35years, Rajaveedhi, Gajularega, Vizianagaam.

ఇందుమూలముగా పైన తెలిపిన ప్రతివాదులందరికి తెలియజేయునది ఏమనగా విజయనగరం జిల్లా, విజయనగరం మునిసిపల్ కార్పొరేషన్ కాపురస్తులు గాడి రాజామణి, బర్త లేటు ప్రసాద్, ఎపిహెచ్‌బి కాలనీ, విజయనగరం తనకున్న అప్పులు చెల్లించలేని శక్తిలేదని తీర్పుచేయమని మరియు పైన తెలిపిన ప్రతివాదుల నుండి రక్షణ కల్పించమని శ్రీ సీనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, విజయనగరంలో I.P.No. 24/2024 పిటిషన్ దాఖలు చేసియున్నారు. కావున ఎవరికైనన ఎటువంటి అభ్యంతరములు, ఆక్షేపణలు వున్నయెడల స్వయముగా గాని లేదా వకీల గా ద్వారాగాని **తే 28-01-2025 దిన ఉదయం గం॥ 10.30 ని॥**లకు పైన తెలిపి కోర్టులో హాజరు కావలెనని, లేనిపక్షంలో శ్రీకోర్టువారు పరోక్షంగా తీర్మానించడమగునని ప్రకటనద్వారా ఈ పత్రిక తెలియజేయుచున్నాము.

GNVS Raghavendra Rao
Advocate, Vizianagaram
Cell: 7032230154

IN THE HONOURABLE COURT OF THE SPECIAL JUDICAIL MAGISTRATE 1ST CLASS COURT (MOBILE) AT VIZIANAGARAM
O.S. 108/2023 I.A.122/2023

Between:
Boora Venkata Ramana, S/o late Pydithalli, Working in ECO Rly as MCM Vizianagaram PF No. 07333924 ...Petitioner/Plaintiff
And:
Krishnaveni w/o late Appala Reddy and 2 others .....Respondents/Defendants

To,
R-1. Krishnaveni, w/o late Appala Reddy Khalasi Helper, aged 45 yrs, kapu by caste Hindu, R/o 186/3 railway new colony, vizianagaram.
R-2. Janapana Naveen reddy, S/o janapana appala reddy, 18yrs, Hindu, Kapu by caste Rest do-
R-3. J. Gunasekhar Reddy, S/o janapana appala reddy, 16yrs, Hindu, Kapu by caste Rest do-

NOTICE

Please take court notice/summons that the above OS is filed against the Respondents 1 to 3. to the suit filed by the plaintiff in the Honourble Special Judicial Magistrate of 1st Class Court (Mobile) at Vizianagaram due to non- service of Court Summons Respondent No.2 of you the Hon'ble Court pleased an order to serve the summons/notice under substituted service to the above stated R.2

Therefore, hereby, informing you that the above matter is posted to **29-01-2025** for your appearance before the Honourable Special Judicial Magistrate of 1st Class Court (Mobile) at Vizianagaram at **10-30 A.M.** If you fail to attend on that day, the matter will be heard and decided exparty.

(By Court Order)

GNVS Raghavendra Rao
Advocate, Vizianagaram
Cell: 7032230154